



## జరిగిన జగన్నాటకం

ఎడమ చేతిని ప్రముఖంగా వాడే సవ్యలంకలో కుడిచేతి పోరాటానికి మహాబసు అనే నాయకుడయ్యాడు బోసు. మరణదండన నుంచి ద్వీప, ఆచార్య వేదాంతం కాపాడారు. రెండుసార్లు దళాధిపతి దాడి నుంచి ఉగ్ర కాపాడాడు. వామదేవుడి గూఢచారి ఉదంతుడు పోరాటంలో చేరాడు. మహాబసుగా తన అనుభవాలన్నింటినీ డా. నరసింహంకి చెప్తుంటాడు సారథి. పేరలల్ వరల్డ్స్ లో ప్రయాణం వల్ల సారథి సవ్యలంకకి వెళ్ళాడని డా. నరసింహం తెలుసుకున్నాడు. వర్తకులతో చర్చలకు వెళ్ళిన మహాబసుపై దాడి చేశాడు దళాధిపతి. సుధాముడు మరణించాడు. ఉదంతుడు మహాబసుని రహస్య మార్గం ద్వారా బయటికి తీసుకెళ్ళిపోయాడు.

# - 22 –

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**జరిగిన జగన్నాటకం**

ఎడమ చేతిని ప్రముఖంగా వాడే సవ్యలంకలో కుడిచేతి పోరాటానికి మహాబసు అనే నాయకుడయ్యాడు బోసు. మరణదండన నుంచి ద్వీప, ఆచార్య వేదాంతం కాపాడారు. రెండుసార్లు దళాధిపతి దాడి నుంచి ఉగ్ర కాపాడాడు. వామదేవుడి గూఢచారి ఉదంతుడు పోరాటంలో చేరాడు. మహాబసుగా తన అనుభవాలన్నింటినీ డా. నరసింహంకి చెప్తుంటాడు సారథి. పేరలల్ వరల్డ్స్ లో ప్రయాణం వల్ల సారథి సవ్యలంకకి వెళ్ళాడని డా. నరసింహం తెలుసుకున్నాడు. వర్తకులతో చర్చలకు వెళ్ళిన మహాబసుపై దళాధిపతి చేసిన దాడిలో సుధాముడు మరణించాడు. ఉదంతుడు మహాబసుని రహస్య మార్గం ద్వారా బయటికి తీసుకెళ్ళిపోయాడు. మహాబసు మరణించాడన్న వార్త గుప్పుమంది.

**"ఈ పాటికి నువ్వు** మరణించావన్న వార్త మీ సైన్యాన్ని చేరే వుంటుంది." చెప్పి నవ్వాడు ఉదంతుడు.

తల మొత్తం భారంగా, బాధగా అనిపిస్తుండటంతో అతి కష్టం మీద తల తెరిచాడు మహాబసు.

"నా శవం కనపడేదాకా వాళ్ళు నమ్మరు" అన్నాడు స్థిరంగా.

"నమ్మడానికి కావాల్సింది సాక్ష్యం ఒకటే కాదు. నమ్మకమైన వ్యక్తి చెప్పే మాట ఏదైనా నమ్ముతారు. నీ సైన్యంలో వందల సంఖ్యలో మా వేగులు వున్నారు. వాళ్ళంతా ఇదే విషయాన్ని చూసినట్లు చెప్పుకుంటున్నారు. కొందరు నీ తల నరికేస్తుంటే చూసినట్లు, మరి కొందరు తెగిపడిన నీ తలని చూసినట్లు.... హహహ్హా..." గట్టిగా నవ్వాడు ఉదంతుడు.

ఏం సమాధానం ఇవ్వాలో అర్థం కాలేదు మహాబసుకి. తాను మరణించినట్లు పుకారు పుట్టించడం వల్ల వాళ్ళు సాధించేది ఏమైనా వుంటుందా అని ఆలోచించాడు. నాయకుణ్ణి కోల్పోయిన సైన్యం కకావికలైపోతుంది. కానీ వెంటనే నాయకత్వాన్ని అందుకోడానికి ఉగ్ర వున్నాడు. శత్రువుని వ్యూహాలను అంచనా వేసి, ఎత్తుకు పై ఎత్తు వెయ్యడం తాను చేసిన ముఖ్యమైన పనుల్లో ఒకటి. ఇప్పుడు ఆ పని చెయ్యడానికి ఆచార్య వేదాంతం వున్నారు కదా. ఇక వీళ్ళు సాధించగలిగిన ప్రయోజనం ఒకటే – ప్రజలలో మహాబసు మీద వున్న నమ్మకాన్ని బద్దలు కొట్టడం.

మహాబసు అనే దైవం వస్తాడని, యుద్ధం జరిపి కష్టాల నుంచి విముక్తి ప్రసాదిస్తాడని ప్రజలంతా అనుకున్నారు. అనుకున్నట్లుగానే తాను వచ్చాడు. వాళ్ళ నమ్మకం నిజమైంది. ఎదురుగా కనపడ్డది దేవుడే అన్నట్లు కొలిచారు. అలాంటి మహాబసు మరణించాడని నమ్మితే వాళ్ళ వాళ్ళ ఆత్మవిశ్వాసాలని కోల్పోతారు. ధైర్యం మిగలదు. ఆశయం విస్మరిస్తారు. ఉద్యమాన్ని నీరుకార్చడం సులభమౌతుంది. శత్రువులకి కావాల్సింది కూడా అదే కదా!

అదే విషయాన్ని ఉదంతుడితో మాట్లాడబోయాడు మహాబసు. కానీ ఇంకా పూర్తిగా శక్తి రాలేదేమో మాట్లాడటానికి కూడా ఇబ్బంది పడ్డాడు. సొరంగ మార్గం చివరికి చేరేదాకా ఏం మాట్లాడకూడదని నిర్ణయించుకోని నిశబ్దంగా వుండిపోయాడు.

అప్పుడే అతని మదిలో మరో ఆలోచన వచ్చింది. అది ప్రజల నమ్మకాల గురించి.

ఒకప్పుడు మహాబసు అనే ఒక రక్షకుడు వస్తాడని నమ్మారు. గురువులు పురాణాలను ఉదహరించి చెప్తే అదే నిజమని విశ్వసించారు. అతని కోసం ఎదురుచూశారు. తాను కనపడిన తరువాత మహాబసు వచ్చేశాడని చెప్పుకున్నారు. గురువులు, ఆచార్యులు, నాయకులు అదే విషయాన్ని ప్రచారం చెయ్యడంతో ఆ నమ్మకం క్రమంగా విస్తరించింది. ఒక్కొక్కరుగా నమ్ముతూ చివరికి ఒక పెద్ద సైన్యమే తయారైంది. ఇంతమంది విశ్వాసం మళ్ళీ ఒక్క మాటతో తుడిచిపెట్టుకుపోయింది. వాళ్ళలో ఒకడు, ఒక సామాన్యుడు మహాబసు మరణించాడని చెప్తే అదే నిజమని ఇప్పుడు అందరూ నమ్మివుంటారా? ఒకవేళ అలా నమ్మినట్లైతే ఇక తాను మహాబసు అన్న నమ్మకమే హాస్యాస్పదం అవుతుంది. అది కాదు బాధించేది. ఇక ఈ పోరాటం ఆగిపోతుంది. ఉద్యమం బూడిదపాలైతుంది. అలా జరగకూడదని కోరుకోవడం మినహా చేయగలిగింది ఏమీ లేదు.

“ఏమిటి మహబసు ఆలోచిస్తున్నావ్?” ఉదంతుడి ప్రశ్నతో తేరుకున్నాడు మహాబసు.

“ఏం లేదు. నమ్మకాల గురించి” చెప్పాలా వద్దా అంటూనే అనేశాడు.

“ఏ నమ్మకం. నువ్వు, నీ జనం నన్ను నమ్మిన సంగతేనా?” అంటూ వెటకారంగా నవ్వాడతను.

మహాబసుకి సమాధానం ఇవ్వాలనిపించలేదు. వాదన చేసే ఓపికలేదు. ఎదుటివాడు అర్థం చేసుకుంటాడన్న నమ్మకమూ లేదు.

మహాబసు ఇలా ఆలోచిస్తుండగానే సొరంగ మార్గం రెండో చివరకి చేరుకున్నారు. అక్కడ సిద్ధంగా వున్న ఇద్దరు సైనికులు రెండు తాళ్ళని కిందకు వదిలి, వాటి ఆధారంగా కిందకు జారి సొరంగలోకి దిగి అక్కడే ఎదురుచూస్తున్నారు.

“జయహో ఉదంతసేనానీ” అన్నారు వాళ్ళిద్దరు ఉదంతుణ్ణి చూడగానే.

“ఈయనే మహాబసు” అన్నాడు ఉదంతుడు మహబసుని చూపిస్తూ.

“జయహో మహాబసు” అన్నారు వాళ్ళు వెంటనే.

మహాబసు ఆశ్చర్యపోయాడు. వాళ్ళు బందీగా వచ్చిన శత్రువుకి జయధ్వానం ఎందుకు చేశారో అర్థం కాలేదతనికి.

“ఏం జరుగుతోంది అక్కడ?” నవ్వుతూ అడిగాడు ఉదంతుడు.

“మనం అనుకునట్లుగానే మహాబసు చనిపోయాడన్న వార్త అందరి నోళ్ళలోనూ నానుతోంది.”

ఉదంతుడు నవ్వాడు.

“ఉద్యమకారులు ఏమనుకుంటున్నారు?”

“రెండు వర్గాలుగా విడిపోయారు. పోరాటం ఆపేద్దామని ఒక వర్గం, కొనసాగించాలని ఒక వర్గం వాదించుకుంటున్నారు. కొనసాగించాలని అంటున్నవారిలో ఆచార్య వేదాంతం, ఉగ్ర వుంటే, ఉద్యమం ఆపేయలన్న వాదన చేస్తున్నది ద్వీప”

ఆశ్చర్యంతోనూ, అపనమ్మకంతోనూ తల ఎత్తి చూశాడు మహాబసు.

“ద్వీప!”

శరాఘాతంలా తగిలిందా మాట. ద్వీప అలాంటి వాదన ఎందుకు చేస్తోంది?

తన ఆశయాలను పంచుకుంటానని చెప్పిన ద్వీప!

తనతో జీవితాన్ని సైతం పంచుకోడానికి సిద్ధపడిన ద్వీప!

బోసుగా వచ్చిన తనని మహాబసు అని నమ్మి, తననే నమ్మించిన ద్వీప!

ఈ రోజు మహాబసు మరణించాడన్న పుకారుని నమ్మి, ఇంతకాలం ఊపిరిగా బతికిన ఉద్యమాన్నే కాదంటోందా!

మళ్ళీ ఆలోచనతో అతని తలలో బాధ పెరిగింది. అది మరింత పెద్దదై తెలివిలేని పరిస్థితిలోకి జారుకున్నాడు.

★★

ఆ గదిలో ఇద్దరే వున్నారు. సారథి, డాక్టర్ నరసింహం. చాలాసేపటి నుంచి జరిగిన కథ మొత్తం వివరంగా చెప్పాడు సారథి. మహాబసుగా అతను ఎలా ఉదంతుడి వెంట సొరంగ మార్గంలోకి వెళ్ళిన విషయం, సమ్రాట్ ఆశోక చక్రవర్తి కనిపించి హెచ్చరించడం గురించి చెప్పాడు. ఆ తరువాత కొద్దిగా తటపటాయిస్తూ ఉద్యమాన్ని ఆపేసే ప్రయత్నం ద్వీప చేయడం గురించి వివరించాడు.

"ద్వీప ఇలా చేస్తుందని ఊహించలేకపోయాను నేను" బాధగా అన్నాడు సారథి.

"దట్స్ ఓకే. అది వేరే ప్రపంచం, ఇది వేరే ప్రపంచం. ఆ ప్రపంచం గురించి ఈ ప్రపంచంలో బాధపడి ప్రయోజనం వుండదు సారథి" అనూనయిస్తూ చెప్పాడు డాక్టర్ నరసింహం.

"కరెక్టే కానీ మనసు ఒప్పుకోవటం లేదే" నవ్వాలని ప్రయత్నిస్తూ అన్నాడు సారథి. ఆ తరువాత చాలాసేపు ఇద్దరూ ఏమీ మాట్లాడుకోవాలో తెలియనట్లు మౌనంగా వుండి పోయారు.

చాలాసేపటి తరువాత సారథే మాట్లాడాడు –

"ఏం జరుగుతోందో అర్థం కావటం లేదు సార్" అని అన్నాడు

"ఏం అర్థం కావాలి సారథి?" కాస్త చిరాగ్గానే ప్రశ్నించాడు నరసింహం.

"నన్ను ప్రాణంగా ప్రేమించిన అమ్మాయి నేను లేను సమయంలో నా ఆశయానికి, సిద్ధాంతాలకి విరుద్ధంగా ఎలా మాట్లాడగలిగింది? నేను ఉన్నంత కాలం నాకు మద్దత్తుని ఇస్తూ, నా సిద్ధాంతాలకి అనుగుణంగా పోరాడిన ద్వీప ఇలా ఇలా చెయ్యగలిగింది? అదే అర్థం కావటంలేదు" అన్నాడు సారథి

"అభిప్రాయం మారటం పెద్ద వింతేముంది? నమ్మిన సిద్ధాంతాన్ని కాదని దానికి వ్యతిరేక సిద్ధాంతాన్ని అవలంబిస్తున్న వారితో కలిసిపోయే నాయకుల్ని నువ్వు చూడలేదా?"

"చూశాను. కానీ అది పొలిటికల్. అలాంటి సందర్భాలలో ఆ లీడర్ ఒకే సిద్ధాంతాన్ని నమ్మాడు అని కూడా ఖచ్చితంగా చెప్పలేము. ఇక్కడ పరిస్థితి అలా కాదు. నేను ప్రతిపాదించిన సిద్ధాంతం సరైనదో కాదో, కానీ ఆ సిద్ధాంతాన్ని మనస్ఫూర్తిగా నమ్మి, అదే సిద్ధాంతం కోసం పోరాటం జరిపి చివరికి ఇలా జారుకోవడం అన్యాయం. ద్రోహం." కోపంగా అరుస్తున్న సారథి వైపు ఆశ్చర్యంగా చూశాడు డాక్టర్ నరసింహం.

"నువ్వేం మాట్లాడుతున్నావో అర్థం అవుతోందా సారథి? అసలు నువ్వు ఎవరివి? ఎవరి గురించి కామెంట్లు చేస్తున్నావో అర్థం అవుతోందా? ఎందుకు వెళ్ళావో తెలియదు కానీ ఏదో విచిత్రమైన లోకానికి వెళ్ళావు. వెళ్ళినందుకు అక్కడ నువ్వు నేర్చుకుందేమిటి? ప్రపంచంలో ఏది జరిగినా అది ఏదో మంచి కోసమే అని మనం నమ్ముతాం కదా? ఆ కొత్త ప్రపంచానికి వెళ్ళడం వల్ల నీకు కలిగిన ప్రయోజనం ఏమిటి? ఆలోచించావా?" ఆవేశంగా ప్రశ్నించాడు డాక్టర్ నరసింహం.

ఆయన ఆవేశం చూసి ఆశ్చర్యపోవడం సారథి వంతైంది.

"ఏమైంది డాక్టర్?" అడిగాడు సారథి.

"అక్కడ నువ్వు ప్రతిపాదించిన సిద్ధాంతం ఏమిటి? ఏ సిద్ధాంతం గురించి పోరాటం చేస్తున్నావో గుర్తుందా?" అడిగాడు ఇంకా అదే ఆవేశంతో

"తెలుసు డాక్టర్. జీవితంలో అన్ని ప్రత్యేకమైన, ప్రాముఖ్యత కలిగిన సందర్భాలలో కుడి చేతిని వాడాలని నేను, ఎడమ చేతిని వాడాలని వాళ్ళు. ఇదే కదా ఇద్దరి మధ్య జరుగుతున్న పోరాటానికి కారణం?"

గట్టిగా నవ్వాడు డాక్టర్

"కుడి చెయ్యి, ఎడమ చెయ్యి. ఇవెంత ట్రివియలో అర్థం చేసుకున్నావా? అక్కడ మహాబసుగా నీ అభిప్రాయాన్ని పక్కన పెట్టు. ఇక్కడ ఈ ప్రపంచంలో సారథిగా చెప్పు. కుడి చెయ్యి వాడటానికి, ఎడమ చెయ్యి వాడటానికి తేడా ఏమైనా వుందనుకుంటున్నావా?"

అంత సూటిగా వచ్చి తగిలిన ప్రశ్నకు సమాధానం చెప్పలేక సతమతమైపోయాడు సారథి.

"కమాన్ చెప్పు. ఆ ప్రపంచంతో పరిచయం లేకపోయుంటే, నేను ఎడమ చేతితో ఏదైనా ఇస్తే తీసుకోవా? కుడిచేత్తోనే ఇవ్వాలని గొడవ చేస్తావా? నన్ను చంపేసేంత ఆలోచన చేస్తావా?"

"లేదు" చాలా పీలగా వుందతని గొంతు.

"మరి ఆ ప్రపంచంలో ఎందుకు అంత గొడవ చేస్తున్నావు?"

"ఏమో తెలియడం లేదు"

"అంటే ఆ ప్రపంచంలో వున్న నీ నమ్మకాలకి, ఈ ప్రపంచంలో వున్న నీ నమ్మకాలకీ సంబంధం లేదు. అవునా?"

"అవును. అలాంటప్పుడు వేరే ఎవరిలోనో అలాంటి కన్సిస్టెన్సీ వుంటుందని ఎందుకు అనుకుంటున్నావు? ప్రతి మనిషి నమ్మిన సిద్ధాంతాలలో మార్పు రావడం సహజం. అంత మాత్రాన వాళ్ళ క్యారక్టర్నే అనుమానించడం తప్పు"

"మీరు చెప్పింది నిజమే. కాదనను. కానీ మూలమైన కొన్ని సిద్ధాంతాలు వుంటాయి. వాటికి మార్పు వుండదు. వాటికి కాంప్రమైజ్ అయ్యే లక్షణం వుండదు. అలాంటి కోర్ వాల్యూస్ ని మార్చుకోవటం అంటే క్యారక్టర్ని చంపుకోవడమే. కాదంటారా?" సారథి ఆ ప్రశ్న అడిగుతున్నప్పుడే ఆలోచించాడు. తన ప్రశ్నలోనే సమాధానం వున్నట్లు అనిపించిందతనికి. అయినా అడిగేశాడు.

"యస్. క్యారెక్టర్ చచ్చిపోతుంది. మనిషిగా మనం ఎప్పటికప్పుడు కొత్త కొత్త అవతారాలను ఎత్తుతూనే వుంటాము. ఎప్పుడు వున్న పరిస్థితిని బట్టి అప్పటి ఆలోచనలు వుంటాయి. మన అవతారం మారినప్పుడు మన ఆలోచనలు మారతాయి. ఆలోచన వల్లే అభిప్రాయాలు మారవచ్చు. చివరికి మన మూలమైన సిద్ధాంతం కూడా మారచ్చు. ఇప్పుడు ద్వీపకి జరిగిందదే. ఆమె ఒకప్పుడు వామదేవుడికి వ్యతిరేకంగా జరగబోయే పోరాటం గురించి చదువుకున్న విద్యార్థిని. అప్పుడు పోరాటం సమంజసమే అనిపించి వుండవచ్చు. ఆ తరువాత నువ్వు, ఐ మీన్ మహాబసు కలిసినప్పుడు యవ్వనోద్రేకంలో ఉద్యమం కల్పించిన తాత్కాలిక ఆవేశంలో పోరాటం సహేతుకమనే అనిపించి వుండవచ్చు. ఆ తరువాత నీతో ప్రేమ. ప్రేమలో తప్పొప్పులు ఏముంటాయి? నీకు నచ్చిందే ఆమెకు నచ్చింది. నువ్వు యుద్ధం అంటే యుద్ధం అంది. ఉద్యమం అంటే ఉద్యమం అంది. పోరాటం అంటే పోరాటమనే అంది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఇప్పుడు నువ్వు ఆమెకు భర్తవి. ఆమెకు పుట్టబోయే బిడ్డకు తండ్రివి. ఆమె ఇప్పుడు భార్యగా ఆలోచిస్తోంది. ఒక తల్లిగా ఆలోచిస్తోంది. ఏ ఉద్యమం అయితే ఆమెకు నిన్ను పరిచయం చేసిందో ఆ ఉద్యమం నీ ముందు చిన్నగా కనిపించడం మొదలైంది. నీ ప్రాణం కాపాడటం కోసం ఉద్యమాన్ని కాదనే స్థితికి చేరుకుంది. నువ్వన్నావే కోర్ వాల్యూ అది ఒకప్పుడు ఉద్యమం, ఇప్పుడు నువ్వు, నీ ప్రాణం. అందుకే యుద్ధం వద్దనింది. తప్పా?" ఆయన ఆవేశంతో హూంకరించినట్లు అడిగేసరికి సారథి సమాధానం లేక మిన్నకుండిపోయాడు.

ఆయన చెప్పింది నిజమేనోమే అన్న అనుమానం అతనికి మొదటిసారి కలిగింది. అయితే అతన్ని కలవరపెట్టింది అది కాదు.

"డాక్టర్! ద్వీప తల్లి కాబోతోందని మీకెలా తెలుసు. మా ఇద్దరికీ పెళ్ళైపోయిన విషయం కూడా మీకు చెప్పలేదు నేను. అయినా ఆ విషయం మీకెలా తెలిసింది? నిజం చెప్పండి? మీరెవరు?" అడిగాడు సారథి.

ఒక్కసారిగా కూలబడిపోయాడు డాక్టర్ నరసింహం. అతను ముఖం మీద పట్టిన చెమట ధారగా కిందకి జారి అతని చొక్కాని తడిపేస్తోంది. అతను చెప్పడం ప్రారంభించాడు.

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS